
సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం : 3 : జూన్ : 2024



కనుమరుగు కానున్న 'టవర్స్'

కేటీపీఎస్ ఓఅండ్ఎం కర్మాగారంలోని కూలింగ్ టవర్ల కూల్చివేత పనులు త్వరలో చేపట్టనున్నారు.

8లో



కోడ్ తర్వాత బదిలీలే..!

ఎన్నికల కోడ్ ముగియగానే విద్యుత్ శాఖ ఉద్యోగులు, కార్మికుల బదిలీల ప్రక్రియ ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది.

8లో



వాతావరణం

జిల్లాలో సోమవారం మధ్యాహ్నం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. సాయంత్రం వాతావరణం చల్లబడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లికి విశేషపూజలు



పెద్దమ్మతల్లికి పూజలు చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి అమ్మవారికి ఆదివారం అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయానికి జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. క్యూలైన్ ద్వారా భక్తులు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. అన్నప్రాసనలు, ఒడిబియ్యం, పసుపు కుంకుమలు, చీరలు సమర్పించారు. పూజా కార్యక్రమంలో ఈఓ జి.సుదర్శన్, వేదపండితులు పద్మనాభశర్మ, అర్చకులు రవికుమార్‌శర్మ పాల్గొన్నారు.

పలు సహకార సంఘాలకు ఎన్నికలు

చుంచుపల్లి: రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీ ఉత్తర్వుల ప్రకారం జిల్లాలోని వివిధ సహకార సంఘాలకు ఈ నెల 6 నుంచి 19 వరకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు జిల్లా సహకార అధికారి సయ్యద్ ఖుర్షీద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 2 పరపతి సహకార సంఘాలు, ఒక మత్స్య పారిశ్రామిక సహకార సంఘం, 3 లేబర్ కాంట్రాక్టు సహకార సంఘాలు, 2 కల్లు గీత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. మిగిలిన సంఘాల ఎన్నికలను దశలవారీగా నిర్ణీత గడువు లోపల నిర్వహిస్తామని తెలిపారు.

క్రీడా శిక్షణను శ్రద్ధతో కొనసాగించాలి



సర్టిఫికెట్లు అందిస్తున్న కలెక్టర్ ప్రియాంక ఆల

పాల్వంచ: క్రీడాకారులందరూ వేసవి శిక్షణ అనంతరం కూడా ప్రాక్టీస్ కొనసాగించాలని కలెక్టర్ ప్రియాంక ఆల అన్నారు. పట్టణ పరిధిలోని శ్రీనివాసనగర్‌కాలనీ మినీ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన వేసవి క్రీడల శిక్షణ ముగింపు కార్యక్రమానికి కలెక్టర్ హాజరై ఖేలో ఇండియా ఆర్చరీ ట్రైనింగ్ సెంటర్ సందర్శించి పిల్లల నైపుణ్యాన్ని చూసి సంతృప్తి వ్యక్తంచేశారు. అనంతరం షటిల్ ఇండోర్ స్టేడియం పరిశీలించి పెండింగ్‌లో ఉన్న పనులు త్వరితగతిన పూర్తి చేసి క్రీడాకారులకు అందుబాటులోకి తేవాలని పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ.. నెలరోజుల పాటు పిల్లలందరూ శ్రద్ధగా వివిధ క్రీడల్లో తర్ఫీదు పొందడం సంతోషమని, పిల్లల తల్లిదండ్రులు కూడా ప్రోత్సాహం అందించాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా 15 కేంద్రాల ద్వారా 675 మందికి నెల పాటు ఆర్చరీ, బాక్సింగ్, కరాటే, తైక్వాండో, రెజ్లింగ్ తదితర క్రీడల్లో శిక్షణ ఇచ్చామన్నారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి పరంధామరెడ్డి, మైనార్టీ అధికారి సంజీవరావు, ఆఫీస్ సూపరింటెండెంట్లు ఉదయ్‌కుమార్, తిరుమల్‌రావు, లక్ష్మయ్య, క్రీడా సంఘాల ప్రతినిధులు, క్యాంప్ శిక్షకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఖమ్మం ట్యాంక్‌బండ్‌పై ఫుడ్ ఫెస్టివల్



పిండివంటలను కొనుగోలు చేస్తున్న నగరవాసులు

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని మెప్మా, డీఆర్డీఏ సెర్ప్ ఆధ్వర్యాన ఖమ్మంలోని లకారం ట్యాంక్ బండ్‌పై ఆదివారం సాయంత్రం ఫుడ్ ఫెస్టివల్ ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఫుడ్ ఫెస్టివల్‌ను సందర్శించి మాట్లాడారు. తెలంగాణ రుచులను ప్రజల దరికి చేర్చేందుకు ఈ ఫుడ్ ఫెస్టివల్ ఏర్పాటుచేసినట్లు తెలిపారు. మహిళా సంఘాల సభ్యులు తయారుచేసిన 58 రకాల వంటకాలను ఫెస్టివల్‌లో ప్రదర్శించగా.. కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ సంపత్‌కుమార్, డీఆర్డీఓ సన్యాసయ్య, అడిషనల్ డీఆర్డీఓ నూరుద్దీన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ధ్యేయం



ప్రగతిలో ఆదర్శంగా నిలుద్దాం

- భవిష్యత్ కర్తవ్యాలను నిర్దేశించుకుందాం
- తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో కలెక్టర్ ప్రియాంక



వేడుకలలో ప్రసంగిస్తున్న కలెక్టర్ డాక్టర్ ప్రియాంక

సూపర్‌బజార్(కొత్తగూడెం): పోరాడి సాధించుకున్న తెలంగాణలో జిల్లాలో ప్రజాసంక్షేమమే ధ్యేయంగా అందరం కలిసికట్టుగా పనిచేద్దామని, ప్రగతిలో ఆదర్శంగా నిలిచి భవిష్యత్ కర్తవ్యాలను నిర్దేశించుకుందామని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో ఆదివారం తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మొదట కలెక్టర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎస్పీ రోహిత్‌రాజ్‌తో కలిసి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అంకితభావం, సేవా దృక్పథంతో పనిచేసి అమరుల త్యాగాలను మననం చేసుకుందామని అన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణాకు 60 ఏళ్ల పోరాట చరిత్ర ఉందని పేర్కొన్నారు. 1969 తెలంగాణ ఉద్యమం ఎగసిపడిందని, 1971లో జరిగిన ఎన్నికల్లో ప్రత్యేక తెలంగాణ డిమాండ్‌కు మద్దతుగా ప్రజాతీర్పు వెలువడిందని గుర్తుచేశారు. 1990 దశకం నుంచి ఉద్యమం మరోసారి ఉవ్వెత్తున ఎగసిపడిందని పేర్కొన్నారు. ఈ ఉద్యమంలో మేధావులు, విద్యావంతులు, ఉద్యోగ, ఉపాధ్యాయులు, కవులు, కళాకారులు, కార్మికులు, కర్షకులు, విద్యార్థులు, మహిళలు కులమత భేదాలు లేకుండా సిద్ధాంత రాద్ధాంతాలకు తావివ్వకుండా ఏకోన్ముఖులై కదిలారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 1,200 మందికి పైగా అమరులయ్యారని గుర్తుచేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి జర్పుల నరేష్, యనమందల వేణుగోపాల్, వెంపటి రామకృష్ణ, రావు సుధాకర్‌రెడ్డి, మీనవేణు, కళాప్రకాష్ కుమార్‌జైన్, అన్నాబత్తుల రవీంద్రనాథ్, ఎస్‌కే మహమూద్ పాషా అమరులయ్యారని గుర్తుచేశారు. స్వరాష్ట్ర సాధన కోసం ప్రాణాలు అర్పించిన త్యాగధనులకు హృదయపూర్వకంగా నివాళులర్పిస్తున్నట్లు తెలిపారు. అమరుల ఆశయాలను, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు మనసా, వాచ, కర్మణా అంకితమవ్వాలని సూచించారు. తెలంగాణ పదకొండో వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా అవతరణ ఉత్సవాలు గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అత్యంత ఘనంగా నిర్వహించుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, డీఆర్‌డీఓ విద్యాచందన, జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు పాల్గొన్నారు.



అమరువీరులకు నివాళులర్పిస్తున్న కలెక్టర్



నివాళులర్పిస్తున్న ఎస్పీ రోహిత్ రాజ్

అమరవీరులకు కలెక్టర్, ఎస్పీ నివాళి

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని ప్రగతిమైదానంలో ఉన్న తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద ఆదివారం కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల, ఎస్పీ రోహిత్‌రాజ్ పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులు అర్పించారు. అదనపు కలెక్టర్ వేణుగోపాల్, డీఆర్‌డీఓ విద్యాచందన, కొత్తగూడెం ఆర్డీఓ మధు, డీఎస్పీ రెహమాన్ తదితరులు నివాళులర్పించినవారిలో ఉన్నారు.

బడిబాటకు రెడీ..

- బడి బయట పిల్లలను పాఠశాలల్లో చేర్పించడమే లక్ష్యం
- నాలుగైదు రోజుల్లో కార్యక్రమం ప్రారంభం

కొత్తగూడెంఅర్బన్: బడి బయట పిల్లలు, బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించేందుకు ఏటా పాఠశాల పునఃప్రారంభానికి ముందు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కూడా ఈ నెల 3 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు షెడ్యూల్ విడుదల చేశారు. అయితే ఈ నెల 4న ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో సోమవారం నుంచి బడిబాట కార్యక్రమం నిర్వహించవద్దని, రీ షెడ్యూల్ వచ్చే వరకు వేచి చూడాలని ఆదేశాలు జారీ చేశారు. అనంతరం రెండు, మూడు రోజుల్లో బడిబాట కార్యక్రమం ప్రారంభించే అవకాశం ఉంది. కాగా బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ప్రదర్శనలు నిర్వహిస్తూ, కరపత్రాలను పంచుతూ అవగాహన చేపడతారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని, ప్రభుత్వం పలు సౌకర్యాలు కల్పిస్తుందని తల్లిదండ్రులకు వివరిస్తూ బడిబయట పిల్లలను బడిలో చేర్పించేందుకు కృషి చేస్తారు. అడ్మిషన్లు పెంచేందుకు పాటుపడతారు.



కొత్తగూడెంలో బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు (ఫైల్)

చదువు మధ్యలో మానివేసిన పిల్లలను, బాల కార్మికులను పాఠశాలల్లో చేర్పిస్తారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్తున్న ఆరేళ్ల వయసు చిన్నారులను ప్రాథమిక పాఠశాలల్లో చేర్పిస్తారు.

రీ షెడ్యూల్ రాగానే..



జిల్లాలో బడిబాట కార్యక్రమం వాయిదా వేశాం. తిరిగి షెడ్యూల్ వచ్చాక హెచ్‌ఎంలకు పంపిస్తాం. కొత్త షెడ్యూల్ ప్రకారం హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు కార్యక్రమాలు నిర్వహించాలి. తేదీల్లో మార్పులున్నా కార్యక్రమాలు అవే ఉంటాయి.

–వెంకటేశ్వరచారి, జిల్లా విద్యాధికారి

బడిబాట కార్యక్రమాలు ఇలా..

- తొలిరోజు అడ్మిషన్ల నమోదుపై గ్రామస్థాయి సమావేశాలు నిర్వహిస్తారు.
- రెండో రోజు బడి ఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించేందుకు ఇంటింటి ప్రచారం చేస్తారు.
- ఆ తర్వాత అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు తల్లిదండ్రులను ప్రోత్సహిస్తారు. బడి మధ్యలో మానివేసిన పిల్లలను మళ్లీ పాఠశాలల్లో చేర్పిస్తారు.
- గ్రామ సభలు నిర్వహిస్తారు.
- పాఠశాలల పునః ప్రారంభం రోజున స్కూళ్లను అందంగా అలంకరిస్తారు.
- పిల్లలను పాఠశాలలకు పంపాలని ఆడియో ప్లే చేస్తారు.
- పాఠశాలల్లో బాల సభలు నిర్వహిస్తారు.
- ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను గుర్తించి, భవిత కేంద్రాల్లో చేర్పిస్తారు.
- పాఠశాలలో మొక్కల పెంపకానికి స్థలాన్ని ఎంపిక చేసి తరగతులవారీగా పిల్లలతో మొక్కలు నాటిస్తారు.
- పాఠశాలలో వివిధ క్రీడా కార్యక్రమాలు నిర్వహిస్తారు.

విద్యార్థుల కోసం హాస్టళ్లు సిద్ధం చేయాలి

భద్రాచలం: విద్యాసంవత్సరం సమీపిస్తున్నందున గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలను సిద్ధం చేయాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో ఆదివారం ఆయన భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల స్పెషలాఫీసర్లతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా పీఓ మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో గాలివెలుతురు ధారాళంగా వచ్చేలా ఏర్పాట్లు చేయడంతో పాటు బెడ్లు, ఇతర సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. అంతేకాకుండా తాగునీటి సరఫరా, టాయిలెట్లు, బాత్‌రూం మరమ్మతులపై దృష్టి సారించాలన్నారు. విద్యాసంవత్సరం ప్రారంభ రోజునే విద్యార్థులు హాస్టళ్లకు వచ్చేలా ఏటీడీఓలు, హెచ్‌ఎంలు, వార్డెన్లు పర్యవేక్షించాలని పీఓ సూచించారు. అనంతరం ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో చేపట్టిన పనుల వివరాల నివేదికలను ఆయన పరిశీలించారు. ఈసమావేశంలో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, గిరిజన సంక్షేమ శాఖ డీడీ మణెమ్మ, వివిధ విభాగాల అధికారులు తానాజీ, భాస్కరన్, అశోక్, రమణయ్య, ఆర్.శ్రీనివాస్, నర్సింహారావు, రూపాదేవి, చంద్రమోహన్, మునీర్ పాషా, హరికృష్ణ, ఓ అలివేలు మంగతాయారు తదితరులు పాల్గొన్నారు.



పనుల నివేదికలను పరిశీలిస్తున్న పీఓ ప్రతీక్‌జైన్

తెలంగాణ సాధనలో సింగరేణి కార్మికుల పాత్ర కీలకం

సింగరేణి సీఎండీ బలరామ్



సన్మానం పొందిన ఉత్తమ కార్మికులతో సింగరేణి సీఎండీ బలరామ్, డైరెక్టర్లు, కార్మిక నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): తెలంగాణ రాష్ట్ర సాధనలో సింగరేణి కార్మికులు కీలక పాత్ర పోషించారని, కార్మికులు సమ్మె చేస్తేనే రాష్ట్ర అవతరణ సాధ్యమైందని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ పేర్కొన్నారు. ఆదివారం కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో జరిగిన తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు హాజరైన ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బలరామ్ మాట్లాడుతూ తెలంగాణ జనం స్వేచ్ఛను పొందిన గొప్ప సుదినమని పేర్కొన్నారు. సింగరేణి కార్మికులు పాల్గొన్న తర్వాతనే తెలంగాణ పోరాటం మరింత పదునెక్కిందని, సకల జనుల సమ్మె విజయవంతమైందని పేర్కొన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి, రూ. 37,500 కోట్ల టర్నోవర్ సాధించామన్నారు. ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాకు నుంచి త్వరలోనే బొగ్గు ఉత్పత్తి ప్రారంభించనున్నట్లు తెలిపారు. కొత్తగూడెంలోని వీకే ఓసీ, ఇల్లెందులో రొంపేడు ఓపెన్ కాస్ట్, బెల్లంపల్లి ఏరియాలో గోలేటి ఓపెన్ కాస్ట్ గనులను ఈ ఏడాది ప్రారంభిస్తామని పేర్కొన్నారు. సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తితోపాటు ఇప్పటికే, థర్మల్, సోలార్ విద్యుదుత్పత్తి చేపట్టిందని, వీటితోపాటు ఇనుము, రాగి ఖనిజాల ఉత్పత్తి చేపట్టేందుకు, ఆఫ్రికా ఖండంలో గనుల నిర్వహణకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వివరించారు. అనంతరం సింగరేణివ్యాప్తంగా 11 ఏరియాల నుంచి ఎంపిక చేసిన ఉత్తమ కార్మికులను సన్మానించారు. ఆ తర్వాత ప్రకాశం స్టేడియం నుంచి కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లోని అమరవీరుల స్తూపం వరకు తెలంగాణ రన్ నిర్వహించారు. అమరవీరులకు నివాళులర్పించారు. తొలుత సింగరేణి ప్రధాన కార్యాలయంలో డైరెక్టర్ (ఈఅండ్‌ఎం) డి. సత్యనారాయణ రావు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ప్రధాన కార్యాలయం ఎదుట తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేశారు. ప్రకాశం స్టేడియంలో ఉదయం, సాయంత్రం విద్యార్థులు, బుల్లితెర నటులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి హాజరైన కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ సింగరేణిని ఎంప్లాయ్‌మెంట్ ఓరియెంటెడ్‌గా అభివృద్ధి చేయాలని, కార్మికుల సంఖ్య పెంచాలని కోరారు. ఎస్పీ రోహిత్‌రాజ్, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ త్యాగరాజన్, వివిధ విభాగాల జీఎంలు, అధికారులు, కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

హైదరాబాద్ పరేడ్‌లో మంచుకొండ వాసి

రఘునాథపాలెం: మండలంలోని మంచుకొండకు చెందిన ఏఆర్ ఎస్సై తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన పరేడ్‌లో పాల్గొని అవార్డు అందుకున్నారు. మంచుకొండకు చెందిన వాంకుడోత్ సురేష్ ఏఆర్ ఎస్సైగా హైదరాబాద్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. హైదరాబాద్‌లో రాష్ట్రప్రభుత్వం తరఫున నిర్వహించిన పరేడ్‌లో పాల్గొన్న ఆయన బృందానికి ట్రోఫీ ప్రకటించగా, సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పలువురు సురేష్‌ను అభినందించారు.



ట్రోఫీతో సురేష్

రామయ్యకు సువర్ణ పుష్పార్చన



స్వామివారికి నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



వేడుకకు హాజరైన భక్తులు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం అంతరాలయంలో మూలమూర్తులకు ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన జరిపారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి చిత్రకూట మండపంలో కొలువుదీరిన స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం నిర్వహించారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్య కల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. ఆదివారం కావడంతో నిత్యకల్యాణం, ఇతర ఆర్జిత సేవలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నిత్యకల్యాణంలో సైతం 101 జంటలు పాల్గొన్నాయి.

సీనియర్ సిటిజన్లకు ప్రత్యేక సౌకర్యం

టికెట్ ద్వారా దర్శనానికి వచ్చే 60 ఏళ్ల పైబడిన సీనియర్ సిటిజన్స్, దివ్యాంగులు, చంటి పిల్లల తల్లులు, వారి సహాయకునికి బేడా మండపంలోని విశ్రాంతి సౌకర్యం, ప్రత్యేక దర్శనం కల్పిస్తున్నట్లు ఆలయ ఈఓ రమాదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గోశాల పక్కన ప్రోటోకాల్ ఆఫీసును ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ రెండు సదుపాయాలకు సంబంధించి ఉత్సవాల సమయంలో, రద్దీ వేళల్లో మార్పులు చేర్పులు ఉంటాయని పేర్కొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

భద్రాచలంటౌన్: శ్రీసీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి ఆదివారం భక్తులు విరాళం అందజేశారు. ఏపీలోని రాజమండ్రికి చెందిన ఎస్.దుష్యత్–సునీల దంపతులు రూ.లక్ష చెక్కును ఆలయ అధికారులకు అందజేశాక స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉద్యోగులు, దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఎనిమిది హాళ్లు.. 1,500మంది ఉద్యోగులు

- లోక్‌సభ ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి
- ప్రత్యక్ష ప్రసారానికి పలుచోట్ల ఎల్‌ఈడీ స్క్రీన్లు
- ఖమ్మం ఆర్‌ఓ, కలెక్టర్ వీ.పీ.గౌతమ్



లెక్కింపు ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఖమ్మం ఆర్‌ఓ గౌతమ్, సీపీ సునీల్‌దత్, అబ్జర్వర్లు

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు మంగళవారం జరగనున్న నేపథ్యాన అన్ని ఏర్పాట్లు చేశామని ఖమ్మం రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ వీ.పీ.గౌతమ్ వెల్లడించారు. ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్లులోని శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను ఆదివారం ఆయన ఎన్నికల సాధారణ పరిశీలకులు డాక్టర్ సంజయ్ జి కోల్టే, లెక్కింపు పరిశీలకులు ప్రేదిమాన్ కృషన్ భట్, సీపీ సునీల్‌దత్‌తో కలిసి పరిశీలించాక వివరాలు వెల్లడించారు.

ఎనిమిది హాళ్లు

లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలైన ఓట్ల లెక్కింపునకు ఏడు హాళ్లు, పోస్టల్ బ్యాలెట్ల కోసం మరో హాల్ సిద్ధం చేశామని గౌతమ్ తెలిపారు. ప్రతీ హాల్‌లో 14, ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గ హాల్‌లో 18 టేబుళ్లు ఉంటాయని చెప్పారు. ప్రతీ టేబుల్‌కి కౌంటింగ్ సూపర్‌వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్, మైక్రో అబ్జర్వర్ ఉంటారన్నారు. ఖమ్మం లోక్‌సభ పరిధిలో 16,31,039మంది ఓటర్లకు 12,41,135 మంది ఓటుహక్కు వినియోగించుకోగా, 10,687 పోస్టల్ బ్యాలెట్లు, 430 సర్వీస్ ఓట్లు పోలయ్యాయని తెలిపారు. అశ్వారావుపేట అసెంబ్లీ నియోజకవర్గంలో 184 పోలింగ్ కేంద్రాలు ఉండగా 13 రౌండ్లలో, సత్తుపల్లి, పాలేరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 290, 294 పోలింగ్ కేంద్రాలు ఉన్నందున 21 రౌండ్లలో లెక్కింపు పూర్తవుతుందని వివరించారు. ఉదయం 8గంటలకు మొదలయ్యే లెక్కింపు మధ్యాహ్నం 3గంటలకల్లా పూర్తయ్యే అవకాశముందని చెప్పారు. మొత్తం 1,500మంది ఉద్యోగులు విధుల్లో పాల్గొంటారని తెలిపారు. కాగా, అభ్యర్థులు ప్రతిపాదించిన 565 మంది ఏజెంట్లకు పాస్‌లు జారీ చేస్తున్నామని కలెక్టర్ వివరించారు. ఇక మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు, ఇతర అనుమానాస్పద సామాగ్రికి అనుమతి ఉండదని స్పష్టం చేశారు.

ప్రధాన కేంద్రాల్లో ఎల్‌ఈడీ స్క్రీన్లు

కౌంటింగ్ వివరాలపై అందరూ ఆసక్తి చూపుతున్న నేపథ్యాన కౌంటింగ్ కేంద్రం వద్దే కాక జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్, పాత బస్టాండ్, రైల్వే స్టేషన్, వైరా, మధిర, సత్తుపల్లి బస్‌స్టేషన్లలో ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటుచేస్తున్నట్లు కలెక్టర్ గౌతమ్ తెలిపారు. అనంతరం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రం వద్ద మూడంచెల భద్రత ఉంటుందని చెప్పారు. ఓట్ల లెక్కింపు అనంతరం సమస్యాత్మక ప్రాంతాల్లో భద్రతా దళాలను మోహరిస్తామన్నారు. కాగా, మీడియా ప్రవేశానికి ప్రత్యేక గేట్ ఉంటుందని తెలిపారు.

క్లుప్తంగా

ఉత్సాహంగా బెంచ్ ప్రెస్ పోటీలు



పోటీల్లో బరువు ఎత్తుతున్న మహిళ

ఖమ్మం స్పోర్ట్స్: ఉమ్మడి జిల్లాస్థాయి బెంచ్‌ప్రెస్, బాడీబిల్డింగ్ పోటీలు ఉత్సాహంగా కొనసాగాయి. ఖమ్మంలో నిర్వహించిన పోటీలకు ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి 150 మంది క్రీడాకారులు హాజరు కాగా ఇందులో 25 మంది మహిళలు పాల్గొన్నారు. జూనియర్స్, సీనియర్స్ పురుషులు, మహిళల విభాగాల్లో వివిధ బరువు కేటగిరీల్లో పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు కృష్ణప్రసాద్, కొండబాల కరుణా కర్, చుండూరి రాజరాజేశ్వరి, డాక్టర్ భారతి, పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సీహెచ్.మనోజ్ పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా హర్ష, పవన్, కిరణ్, నగీనా వ్యవహరించారు.

ఒలింపిక్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి మృతిపై సంతాపం



హరినాథ్‌రెడ్డి (ఫైల్)

ఖమ్మంస్పోర్ట్స్: ఉమ్మడి ఖమ్మం జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి బి.హరినాథ్‌రెడ్డి ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. సుదీర్ఘకాలం ఒలింపిక్ కార్యదర్శిగా పనిచేసిన ఆయన ఉమ్మడి జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శిగా కూడా క్రీడాభివృద్ధికి కృషి చేశారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో నివసిస్తున్న హరినాథ్‌రెడ్డి ఎందరో క్రీడాకారులను తీర్చిదిద్దారు. ఆయన మృతిపై ఒలింపిక్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పుట్టా శంకరయ్య, కె.క్రిస్టోఫర్‌బాబు, డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డితో పాటు పి.రఘునందన్, అనంతరాములు తదితరులు సంతాపం ప్రకటించారు.

రోడ్డుప్రమాదంలో నలుగురికి గాయాలు

పాల్వంచరూరల్: వేగంగా వచ్చిన కారు ఆటోను ఢీకొట్టగా అందులో ప్రయాణిస్తున్న నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. టేకులపల్లి మండలం ఆంగోతు తండాకు చెందిన భూక్యా రాంసింగ్, భూక్యా మంగీలాల్, మాలోతు పుర్యా, భూక్యా కృష్ణ మేకలు కొనుగోలు చేసేందుకు ఆదివారం అద్దె ఆటోలో బూర్గంపాడు మండలం కృష్ణసాగర్ గ్రామానికి బయలుదేరారు. పాల్వంచ మండలం రంగాపురం అంజనేయస్వామి గుడి వద్ద భద్రాచలం నుంచి పాల్వంచవైపు వేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో ఆటో బోల్తాపడింది. దీంతో నలుగురికి తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కాగా, బాధితుల ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన ఏపీలోని పశ్చిమగోదావరి జిల్లా ఉర్లగూడెంనకు చెందిన ఎం.చంద్రశేఖర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

పోలీసుల విచారణ



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

ములకలపల్లి: బొడ్రాయి ప్రతిష్ఠాపనకు చందా ఇవ్వలేదని రెండు నెలల కిందట కుల బహిష్కరణ చేసి, తమ బంధువు చనిపోతే చూడటానికి వెళ్లిన తమపై గ్రామస్తులు దాడి చేశారని చాపరాలపల్లి ఎస్సీకాలనీకి చెందిన గద్దల బ్లెసీన్, రాజు దంపతుల ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. హెడ్‌కానిస్టేబుల్ రామారావు, కానిస్టేబుల్ తిరుపతి ఆదివారం గ్రామాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. ఘటనకు సంభందించి గ్రామస్తుల నుంచి సమగ్ర సమాచారం అడిగి తెలుసుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు చేపడతామని ఎస్‌ఐ రాజమౌళి తెలిపారు.

కనుమరుగు కానున్న 'టవర్స్'

- త్వరలో కూలింగ్ టవర్ల కూల్చివేత
- కేటీపీఎస్ పాత ప్లాంట్‌లో ఎన్నికల కోడ్‌తో నిలిచిన అనుమతులు
- ఢిల్లీ నోయిడా టవర్స్ కూల్చిన సంస్థతో కూల్చివేతకు రంగం సిద్ధం

పాల్వంచ: పాల్వంచలో కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ పాత ప్లాంట్ (ఓఅండ్‌ఎం)లోని కూలింగ్ టవర్ల కూల్చివేత పనులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. అత్యంత ఎత్తయిన ఈ టవర్ల కూల్చివేత మినహా మిగిలిన విభాగాలను ఇప్పటికే నేలమట్టం చేసి వాటి తుక్కును తరలించేశారు. ఈ కూలింగ్ టవర్ల కూల్చివేతకు మాత్రం ఎన్నికల కోడ్ అడ్డంకి కావడంతో అనుమతులు పెండింగ్ పడ్డాయి. అయితే ఢిల్లీలోని నోయిడా టవర్లను కూల్చిన సంస్థతో ఇప్పటికే ఒప్పందం చేసుకుని వాటిని తొలగించేలా కాంట్రాక్ట్ సంస్థ అయిన హెచ్‌ఆర్ కమర్షియల్ ఇప్పటికే రంగం సిద్ధం చేసుకుంది. ఈ టవర్ల కూల్చివేత విషయంపై ఇటీవల జిల్లా అదనపు కలెక్టర్, ఇతర అధికారులు సైతం పరిశీలించగా, అనుమతులను జిల్లా కలెక్టర్ ఇవ్వాల్సి ఉంది. అయితే కోడ్‌తో కొంత ఆలస్యం అవుతోంది.

ఇప్పటికే 80 శాతం పూర్తి

1965 – 67 దశకంలో నిర్మించిన కేటీపీఎస్ ఏ, బీ, సీ, స్టేషన్లలోని 60 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 1, 2, 3, 4 యూనిట్లు, 120 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 5, 6, 7, 8 యూనిట్లు ఉన్నాయి. కాగా ఒక్కో స్టేషన్‌కు ఒక్కో కూలింగ్ టవర్ చొప్పున మొత్తం 8 నిర్మించారు. ఈ నిర్మాణాలే ఎంతో ప్రసిద్ధికెక్కాయి. విద్యుత్ ఉత్పత్తి చేసే క్రమంలో నీరు, బొగ్గు మండించిన క్రమంలో వేడిని తగ్గించేందుకు కూలింగ్ టవర్ల ఆవశ్యకత ఎంతో ఉంది. ఈ టవర్లను చూసేందుకు సైతం అనేక మంది టూరిస్టులు ఇష్టపడుతుంటారు. కాగా కూలింగ్ టవర్లు, సివిల్ పనులు మినహా ఏ, బీ, సీ స్టేషన్లలోని మిగిలిన 80 శాతం కూల్చివేత పనులు పూర్తయ్యాయి.



త్వరలో కూల్చనున్న పాత ప్లాంట్ కూలింగ్ టవర్లు

ఒక్కచోటే కుప్పకూలేలా చర్యలు

ఇప్పటికే 100, 120 మీటర్ల ఎత్తులో ఉండే చిమ్నీలను గత ఫిబ్రవరి మాసంలో నేలమట్టం చేశారు. ఈ నిర్మాణాల కూల్చివేత పనులు జ్ఞాపకాలుగా మిగిలిపోగా ఇక చిమ్నీల నేలమట్టం అరుదైన ఘటన అని చెప్పవచ్చు. కాగా ఈ పనులు పూర్తి చేయాలంటే చిమ్నీ చుట్టూర ఎక్స్‌ప్లోజర్స్‌ను పెట్టి పక్కకు పడకుండా ఒకేచోట కుప్పకూలేలా చర్యలు తీసుకుంటున్నారు. అయితే, ఢిల్లీలో ఇటీవల నోయిడా టవర్లు కూల్చిన సంస్థతో హెచ్ ఆర్ కమర్షియల్ సంస్థ ఒప్పందం చేసుకున్నట్లు సమాచారం.

పాత ప్లాంట్ కూల్చివేత పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న జెన్‌కో డైరెక్టర్ లక్ష్మయ్య

పాల్వంచ: కాలంచెల్లిన కేటీపీఎస్ పాత ప్లాంట్ (ఓఅండ్‌ఎం) కూల్చివేత పనులను ఆదివారం జెన్‌కో డైరెక్టర్ (థర్మల్) బి.లక్ష్మయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా కర్మాగారంలోని ఏ, బీ, సీ స్టేషన్లలో ఇప్పటికే పలు విభాగాలను హెచ్ ఆర్ కమర్షియల్ సంస్థ కూల్చివేసి, ముడి సరుకు తుక్కును తరలించిన విధానాన్ని ఇన్‌చార్జ్ సీఈ జి.రాజ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. కాగా 80 శాతం పనులు పూర్తయ్యాయని, సివిల్ పనులు పెండింగ్‌లో ఉన్నాయని సీఈ తెలిపారు. అనంతరం డైరెక్టర్ రిజర్వాయర్ ఏరియాను పరిశీలించారు. 7వ దశ కర్మాగారంలోని 800 మెగావాట్ల ఉత్పత్తి తీరును అడిగి తెలుసుకున్నారు. డైరెక్టర్ వెంట ఎస్‌ఈలు కిరణ్‌కుమార్, యుగపతి, ఇతర ఇంజనీర్లు పాల్గొన్నారు.

కోడ్ తర్వాత బదిలీలే..!

- విద్యుత్ శాఖ ఉద్యోగుల బదిలీకి రంగం సిద్ధం..
- ఒకేచోట మూడేళ్లు పనిచేసిన వారికి స్థానచలనం
- సుదీర్ఘకాలం ఏజెన్సీలో పనిచేస్తున్న వారు మైదాన ప్రాంతాలకు..
- త్వరలోనే మార్గదర్శకాలు విడుదల



ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ శాఖ ఉద్యోగులు, కార్మికుల బదిలీలకు సంస్థ రంగం సిద్ధం చేస్తోంది. ఎన్నికల కోడ్ ముగియగానే యాజమాన్యం బదిలీల ప్రక్రియ ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. ట్రాన్స్‌కోలోని వివిధ కేడర్ల ఉద్యోగులు, కార్మికుల బదిలీలపై విద్యుత్ సంస్థల సీఎండీతో ఇప్పటికే చర్చించినట్లు సమాచారం. ఏటా సంస్థలో బదిలీల ప్రక్రియ నిర్వహిస్తున్నా ఈసారి ప్రభుత్వం మారిన నేపథ్యాన ప్రక్రియలో పలు మార్పులు చోటు చేసుకునే అవకాశం ఉందని చెబుతున్నారు. ఒకే చోట మూడేళ్ల సర్వీస్ పూర్తయిన వారిని బదిలీలకు అర్హులుగా గుర్తించనుండగా.. కనీసం 50 శాతం మందికి తప్పనిసరి బదిలీ జరిగే అవకాశముంది. ఇక సుదీర్ఘకాలం ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులను మైదాన ప్రాంతాలకు బదిలీ చేయనున్నట్లు తెలుస్తోంది.

మూడేళ్ల సర్వీస్ ప్రామాణికం

ఒకే సెక్షన్‌లో మూడేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న వారిని బదిలీలకు అర్హులుగా గుర్తించేలా మార్గదర్శకాలు రూపొందించనున్నట్లు సమాచారం. ఇదే సమయాన ఉద్యోగులు, కార్మికులు పనిచేసే జిల్లా నుంచి ఇతర జిల్లాలకు, ఇతర డివిజన్లకు కూడా పరస్పర బదిలీలకు అవకాశం కల్పించడం, ఆరోగ్యపరమైన సమస్యలను పరిగణనలోకి తీసుకునేలా సంస్థ పరిశీలిస్తున్నట్లు చర్చ జరుగుతోంది. ఇక రెండు వేర్వేరు సంస్థల్లో దంపతులను ఒకే ప్రాంతానికి అవకాశం కల్పించేలా నిబంధనలు రూపొందించనున్నట్లు తెలిసింది. ఖమ్మం జిల్లాలోని ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్‌ఎం) విభాగంలో 870 మంది ఉద్యోగులు, కార్మికులు పని చేస్తుండగా, భద్రాద్రి జిల్లాలోనూ దాదాపు ఇదే సంఖ్యలో ఉద్యోగులు ఉన్నారు. కార్మికుల విభాగాల్లో జూనియన్ లైన్‌మెన్, అసిస్టెంట్ లైన్‌మెన్, లైన్‌మెన్, లైన్ ఇన్‌స్పెక్టర్, అసిస్టెంట్ లైన్ ఇన్‌స్పెక్టర్, ఫోర్‌మెన్‌లను.. ఉద్యోగులు, అధికారుల విభాగాల్లో ఎల్‌డీసీలు, యూడీసీలు, అకౌంట్స్ విభాగంలో జూనియర్, సీనియర్, అసిస్టెంట్ అకౌంటెంటెంట్లను సర్కిల్, డివిజన్ల స్థాయిలో బదిలీ చేసే అవకాశముంది. అయితే, మూడేళ్ల సర్వీస్‌ను ప్రామాణికంగా తీసుకోనున్నా విద్యుత్ సరఫరా, నిర్వహణలో ఇబ్బందులు తలెత్తకుండా 50 శాతం మందిని మాత్రం తప్పక బదిలీ చేసేలా మార్గదర్శకాలు రూపొందిస్తున్నట్లు సమాచారం. ఇక యూనియన్లు, వెల్ఫేర్ అసోసియేషన్లకు సంబంధించి ఒక్కో సంఘం నుంచి అధ్యక్ష, కార్యదర్శుల చొప్పున రెండు జిల్లాల్లో 12 సంఘాలకు చెందిన 48 మందికి బదిలీల నుంచి మినహాయింపు దక్కే అవకాశముందని సమాచారం.

ఇకపై మైదాన ప్రాంతాలకు..

బదిలీల్లో భాగంగా ఏజెన్సీ ప్రాంతాల్లో దీర్ఘకాలంగా పనిచేసే ఉద్యోగులు, కార్మికులు పెద్ద సంఖ్యలో మైదాన ప్రాంతాలకు బదిలీ అయ్యే అవకాశముంది. పలువురు ఉద్యోగులు పలుకుబడి, పెద్దల ఆశీస్సులతో ఒకేచోట ఏళ్లుగా తిష్ట వేశారు. వీరి స్థానంలో ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేసే ఉద్యోగులకు అర్హత ఆధారంగా అవకాశం కల్పించేందుకు మార్గదర్శకాలు రూపొందిస్తున్నట్లు సమాచారం.

నెల రోజుల్లో బదిలీలు

ఎన్నికల కోడ్ ముగియగానే నెలరోజుల్లోగా కేడర్ల వారీగా బదిలీల ప్రక్రియకు శ్రీకారం చుట్టే అవకాశం ఉంది. పాఠశాలలు, సీజన్ ఆధారంగా పనులు కుంటుపడకుండా నిర్వహణ తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని బదిలీల ప్రక్రియను ఈ నెలాంతానికి పూర్తి చేయనున్నట్లు సమాచారం. ఇప్పటికే టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి వివిధ ఉద్యోగ, కార్మిక సంఘాలతో చర్చించి అభిప్రాయాలు సేకరించినట్లు తెలిసింది. త్వరలో మార్గదర్శకాలు విడుదలైతే సర్కిళ్లు, డివిజన్ల అధికారులకు బదిలీలపై ఆదేశాలు అందే అవకాశముంది.

అమరుల త్యాగ ఫలితమే తెలంగాణ

- భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్
- ప్రభుత్వ కార్యాలయాల్లో ఘనంగా రాష్ట్ర అవతరణ వేడుకలు



జాతీయ జెండాకు వందనం చేస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు



రామాలయంలో జెండా ఆవిష్కరిస్తున్న ఈఓ రమాదేవి

భద్రాచలం: సుదీర్ఘ పోరాటాలు, అమరుల త్యాగాల ఫలితంగానే తెలంగాణ ఏర్పడిందని ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర పదో ఆవిర్భావ వేడుకలను భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించిన పీఓ, అమరవీరుల స్థూపం, తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నివాళులర్పించాక జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఏపీఓ జనరల్ డేవిడ్ రాజ్, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు. ఇక భద్రాచలంలో శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థాన కార్యాలయంలో ఈఓ ఎల్.రమాదేవి జెండా ఆవిష్కరించి మాట్లాడారు. ఉద్యోగులు భవానీ రామకృష్ణ, రవీందర్, ఆలయ ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



ఐటీడీఏలో జెండా వందనం సమర్పిస్తున్న పీఓ ప్రతీక్‌జైన్, ఉద్యోగులు

ఘనంగా 'ఆవిర్భావ' వేడుకలు

కొత్తగూడెంటౌన్: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఎస్పీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఎస్పీ రోహిత్‌రాజు జాతీయ జెండా ఆవిష్కరించి, గౌరవ వందనం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. సంఘ విద్రోహ శక్తుల పట్ల కఠినంగా ఉంటూ సామాన్య ప్రజల్లో భరోసా కల్పిస్తూ, ఎలాంటి వివక్ష లేకుండా సేవలు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ టి.సాయిమనోహర్, ట్రైనీ ఏఎస్పీ విక్రాంత్ సింగ్, డీఎస్పీ రెహమాన్, సతీశ్‌కుమార్, మల్లయ్యస్వామి, సీఐ కరుణాకర్, వెంకటేశ్వర్లు, నాగరాజు, రమేశ్, శివప్రసాద్, సత్యనారాయణ, ముత్యం రమేశ్, ఆర్‌ఐలు సుధాకర్, రవి, నర్సింహారావు, కృష్ణారావు పాల్గొన్నారు.

జిల్లా కోర్టులో..

కొత్తగూడెంలోని జిల్లా కోర్టులో ఆదివారం తెలంగాణ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి పాటిల్ వసంత్ జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. భాష, యాస, సంస్కృతి కోసం, స్వయం పరిపాలన కోసం ఎన్నో పోరాటాలు చేసి తెలంగాణ సాధించుకున్నామని తెలిపారు. న్యాయమూర్తులు గొల్లపూడి భానుమతి, బత్తుల రామరావు, కె.సాయిశ్రీ, వి.శివనాయక్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణతో పాటు ఏపూరి బాబురావు, పోసాని రాధాకృష్ణమూర్తి, వెలగల నాగిరెడ్డి, రావి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కోర్టు ఆవరణలో జాతీయజెండా ఆవిష్కరిస్తున్న జిల్లా జడ్జి పాటిల్ వసంత్

గంజాయి పట్టివేత

జూలూరుపాడు: ద్విచక్రవాహనంపై ఇద్దరు వ్యక్తులు గంజాయి తరలిస్తుండగా స్థానిక పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ జీవన్‌రాజు కథనం ప్రకారం.. పోలీస్ స్టేషన్ ఎదురుగా వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వెళ్తున్నారు. వారిని ఆపి తనిఖీ చేయగా గంజాయి లభించింది. వారిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి 3.9 కేజీల గంజాయి స్వాధీనం చేసుకోవడంతోపాటు బైక్‌ను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు. సూర్యాపేటకు చెందిన రాజేశ్, నౌషద్ సీలేరు నుంచి బైక్‌పై గంజాయిని సూర్యాపేట తరలిస్తూ పట్టుబడ్డారని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ జీవన్‌రాజు వివరించారు.

మేమూ తాగుతాం.. థమ్సప్



కూల్ డ్రింక్ తాగుతున్న కోతి

మండుతున్న ఎండలతో మానవాళికే కాకుండా ఇతర జీవరాశులకు కూడా తాగేందుకు నీరు దొరకడం లేదు. కొన్ని ప్రాంతాల్లో పలు జీవులు దాహం తీర్చుకునేందుకు ఇబ్బంది పడుతున్నాయి. అయితే, మండలంలోని కిన్నెరసాని పర్యాటక ప్రాంతంలో ఓ వ్యక్తి థమ్సప్ కొనుక్కుని తాగుతుండగా ఓ కోతి గమనించింది. అనంతరం అతడి నుంచి లాక్కుని.. గెస్ట్ హౌస్ గేట్‌పై కూర్చుని గటగట తాగేసింది. దీంతో కోతులు కూడా నీటి కోసం అలమటిస్తున్నాయని తెలుస్తోంది.

– పాల్వంచరూరల్

ఆదుకోండి..

దీనగాథ

రోడ్డు ప్రమాదంలో గాయపడి మెరుగైన వైద్యం కోసం ఎదురుచూస్తున్న యువకుడు



చికిత్స పొందుతున్న రాజు

అశ్వాపురం: గత నెల 27వ తేదీన మణుగూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన అశ్వాపురం మండలం మిట్టగూడెం జీపీ పాయం మంగయ్య గుంపునకు చెందిన ఆలం రాజు వైద్యం కోసం ఇబ్బంది పడుతూ దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నాడు. ప్రమాదంలో చిన్న మెదడుకు గాయమైంది. రాజును వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి హన్మకొండలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. రాజుది నిరుపేద కుటుంబం కావడంతో ఇప్పటివరకు ఉన్నదంతా విక్రయించి వైద్యం అందించారు. ప్రస్తుతం వైద్య ఖర్చులకు ఆర్థిక స్థోమత లేక ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చారు. ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే స్పందించి రాజుకు మెరుగైన వైద్యం అందించి ప్రాణాలు కాపాడేలా చొరవ తీసుకోవాలని కుటుంబసభ్యులు, స్నేహితులు కోరుతున్నారు. రాజు వైద్య ఖర్చుల కోసం అతని స్నేహితులు దాతల సహాయం కోరుతున్నారు. ఆర్థిక సహాయం చేయదలచిన వారు రాజు ఫోన్ పే నంబర్ 63047 22475ను సంప్రదించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రెజర్‌బాంబు పేలి యువకుడికి తీవ్ర గాయాలు



యువకుడికి ప్రథమ చికిత్స చేస్తున్న వైద్యులు

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో మావోయిస్టులు అమర్చిన ప్రెజర్ బాంబు పేలగా ఓ ఆదివాసీ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. బీజాపూర్ జిల్లా చుత్వాయి గ్రామానికి చెందిన మడివి నంద ఆదివారం గ్రామ సమీపాన అటవీ ప్రాంతానికి కట్టెల కోసం వెళ్లాడు. ఈ సందర్భంలో మావోయిస్టులు అమర్చిన ప్రెజర్ బాంబును గమనించకుండా కాలు మోపడంతో అది పేలి కుడికాలుకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న తెర్రెం పోలీసులు చేరుకుని ఆయనకు ప్రథమచికిత్స అనంతరం అంబులెన్సులో బీజాపూర్ ఆస్పత్రికి తరలించారు.

ప్రాణం తీసిన ఈత సరదా

పాల్వంచ: సరదాగా స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లిన ఓ విద్యార్థి నీటమునిగి మృత్యువాత పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని శివనగర్ ఏరియాకు చెందిన అలవాల రాములు కుమారుడు గౌతమ్ (17) ఆదివారం గాంధీనగర్‌కు చెందిన తన స్నేహితులు చింతలచెర్వు లక్ష్మీరాము, ఏర్ల సంతోష్‌కుమార్‌తో కలిసి కరకవాగు వద్ద గల కేటీపీఎస్ కాల్వలో ఈత నేర్చుకునేందుకు వెళ్లాడు. గౌతమ్ ఈత కొట్టేందుకు ముందుగా కాల్వలోకి దిగాడు. కాల్వ నీరు అధికంగా వస్తుండటంతో నీటమునిగాడు. ఒడ్డున ఉన్న లక్ష్మీరాము, సంతోష్‌కుమార్‌కు ఈత రాకపోవడంతో బంధువులకు, స్నేహితులకు సమాచారం అందించారు. వారు వచ్చి గౌతమ్‌ను బయటకు తీసి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. గౌతమ్ ఇటీవల ఇంటర్మీడియట్ పూర్తి చేశాడు. మృతుడి తండ్రి రాములు ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రాఘవయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సామగ్రి దగ్ధం



కాలి బూడిదైన సామగ్రి

బూర్గంపాడు: నాగినేనిప్రోలు రెడ్డిపాలంలోని దీవెన జీసస్ ప్రార్థనా మందిరంలో ఆదివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో చర్చిలోని సామగ్రి పూర్తిగా దగ్ధమైంది. చర్చిలో ఆదివారం ప్రార్థనల అనంతరం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కాగా సౌండ్ సిస్టం, కుర్చీలు, సోఫాలు, భోజన సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. చర్చి ప్రాంగణంలో ఉన్న కారుకు కూడా మంటలు వ్యాప్తించి పాక్షికంగా దెబ్బతింది. ఒక్కసారిగా మంటలు వ్యాపించటంతో చర్చి నిర్వాహకులు, ప్రార్థనలకు వచ్చిన వారు భయభ్రాంతులకు గురై బయటకు పరుగులు తీశారు. స్థానికులు వెంటనే భద్రాచలం అగ్నిమాపక కేంద్రానికి సమాచారమిచ్చారు. వారు ఘటనా ప్రాంతానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

కిన్నెరసాని జలాశయంలో దూకిన వివాహిత

నీట మునుగుతుండగా రక్షించిన బోటు సిబ్బంది



కిన్నెరసానిలో దూకిన సరిత

పాల్వంచరూరల్: దంపతుల మధ్య గొడవ కారణంగా ఓ మహిళ మండలంలోని కిన్నెరసాని డ్యామ్ పైనుంచి రిజర్వాయర్‌లో దూకింది. అయితే, సకాలంలో స్పందించిన బోటు సిబ్బంది ఆమెను రక్షించారు. ప్రత్యక్ష సాక్షులు, పోలీసులు తెలిపిన వివరాలు... పాల్వంచలోని ఎన్‌ఎండీసీ కాలనీకి చెందిన సరిత, ఆమె భర్త సంజీవరెడ్డి నడుమ తరచూ గొడవలు జరుగుతున్నాయి. దీంతో ఆమె ఆదివారం ఉదయం ఆటోలో కిన్నెరసానికి చేరుకుని డ్యామ్‌పైకి వెళ్లింది. అక్కడ ఎనిమిది మీటర్ల ఎత్తులో ఉన్న 7, 8వ నంబర్ డ్యామ్ గేట్ల మధ్య నుంచి రిజర్వాయర్‌లోకి దూకింది. ఈవిషయాన్ని గమనించిన డ్యామ్ ఉద్యోగి అనిల్ బోటింగ్ సిబ్బంది హజర్, బాబూరావుకు సమాచారం ఇవ్వగా వారు బోటులో వెళ్లి నీట మునిగిపోతున్న సరితను రబ్బర్ టైర్ సాయంతో రక్షించి బోటులో ఒడ్డుకు చేర్చారు. అనంతరం చేరుకున్న ఎస్‌ఐ శ్రీనివాస్ సరితను తీసుకెళ్లి ఆమె భర్త, పిల్లలను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు.



కిన్నెరసాని రిజర్వాయర్‌లో దూకిన సరితను బోట్‌లోకి చేర్చిన సిబ్బంది

ఒడ్డుగూడెంలో వ్యక్తి ఆత్మహత్య



భాస్కర్ (ఫైల్)

ఇల్లెందురూరల్: మండలంలోని ఒడ్డుగూడెం గ్రామంలో బానోత్ భాస్కర్ (43) ఆదివారం బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ కలహాల కారణంగా మనస్తాపానికి గురైన భాస్కర్ ఈ చర్యకు పాల్పడినట్లు గ్రామస్తులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. శవపరీక్ష నిమిత్తం భాస్కర్ భౌతికకాయాన్ని ఇల్లెందు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. భాస్కర్‌కు భార్య సుజాత, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

భద్రాచలంఅర్బన్: ఓ వాహనంలో అనుమతి లేకుండా పశువులను తరలిస్తున్నవారిని పట్టణంలోని ఫారెస్టు చెక్‌పోస్టు వద్ద ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. చర్లలోని పశువుల సంతలో ఐదు ఆవులను కొనుగోలు చేసి ట్రాలీ ఆటోలో అన్నపురెడ్డిపల్లి తరలిస్తుండగా టౌన్ పోలీసులు స్వాధీనం చేసుకుని, ఇద్దరిపై కేసు నమోదు చేశారు. ఆవులను పాల్వంచలోని గోశాలకు తరలించినట్లు పోలీసులు చెప్పారు.

నాలుక్కర్చుకున్న ఇండియాటుడే-యాక్సిస్ మై ఇండియా

- రాష్ట్ర ఎన్నికలపై ఎగ్జిట్ పోల్స్‌పై విస్తుపోయిన రాజకీయ విశ్లేషకులు
- గ్రామీణ ప్రాంత ప్రజలు, మహిళలు అధిక శాతం వైఎస్సార్‌సీపీకే మద్దతుగా నిలిచారన్న రాజ్‌దీప్ సర్దేశాయ్
- మీరు చేసిన సర్వే సహేతుకంగా కన్పించడం లేదంటూ యాక్సిస్ మై ఇండియా అధినేత ప్రదీప్‌గుప్తాకు చురక

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలపై వెల్లడించిన ఎగ్జిట్ పోల్స్‌పై ఇండియాటుడే-యాక్సిస్ మై ఇండియా నాలుక్కర్చుకుంది. యాక్సిస్ మై ఇండియా నిర్వహించిన ఎగ్జిట్ పోల్స్‌ను ఇండియాటుడే శనివారం ప్రసారం చేసింది. ఈ సర్వేపై దేశ వ్యాప్తంగా రాజకీయ విశ్లేషకులు విస్మయం వ్యక్తం చేయడంతో.. ఆదివారం ఇండియాటుడే టీవీలో చర్చ చేపట్టింది. 'ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అద్భుతంగా పనిచేసింది. ఐదేళ్లలో విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రుల రూపురేఖలు మారిపోయాయి. డీబీటీ పథకాల ద్వారా రూ.2.70 లక్షల కోట్ల లబ్ధి పేదలకు నేరుగా చేరాయి. జగన్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల పట్ల గ్రామీణ ప్రజలు..ముఖ్యంగా మహిళలు ఎక్కువగా ఆకర్షితులయ్యారు. వారంతా ఈ ఎన్నికల్లో జగన్‌కు అండగా నిలిచారని అంచనా వేస్తున్నాం'అని ఇండియా టుడే కన్సల్టింగ్ ఎడిటర్ రాజ్‌దీప్ సర్దేశాయ్ అన్నారు. ఏపీలో జరిగిన మార్పును స్వయంగా చూశాను. పాఠశాలలు, ఆస్పత్రులు చాలా మార్పు కన్పించిందన్నారు. ఈ నేపథ్యంలో మీరు చేసిన సర్వే సహేతుకంగా లేదన్నది స్పష్టమవుతోందంటూ యాక్సిస్ మై ఇండియా అధినేత ప్రదీప్ గుప్తాకు రాజ్‌దీప్ సర్దేశాయ్ చురకలంటించారు. స్కిల్ స్కామ్‌లో చంద్రబాబును అరెస్టు చేయడం వల్ల ప్రజల్లో సానుభూతి.. దక్షిణాది రాష్ట్రాల్లో ఐదేళ్లకు ఓ సారి ప్రభుత్వాన్ని మార్చే సంప్రదాయం ఉండటం ఏపీలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమికి అనుకూలించిందని ప్రదీప్ గుప్తా చెప్పారు. దీనిపై యాంకర్ రాహుల్ కన్వల్ స్పందిస్తూ.. కేజ్రీవాల్ అరెస్టు వల్ల ఢిల్లీ, పంజాబ్‌లో.. హేమంత్ సోరేన్ అరెస్టు వల్ల జార్ఖండ్‌లో ప్రజల్లో సానుభూతి రాలేదా.. అక్కడ ఎగ్జిట్ పోల్స్‌లో అది ప్రతిబింబించలేదేం అంటూ ప్రదీప్ గుప్తాను నిలదీశారు. తమిళనాడులో జయలలిత.. తెలంగాణలో కేసీఆర్ వరుసగా రెండు సార్లు విజయం సాధించారని ఎత్తిచూపారు. వీటిని పరిశీలిస్తే.. మీ సర్వే శాస్త్రీయంగా లేదేమోనని అనుమానాలు వ్యక్తం చేయడంతో ప్రదీప్‌గుప్తా నీళ్లు నమిలారు. ఇండియాటుడే-యాక్సిస్ మై ఇండియా ఎగ్జిట్ పోల్స్ 2021లో బెంగాల్‌లోనూ అంచనాలు తప్పాయి. అక్కడ బీజేపీ విజయం సాధిస్తుందని చెప్పగా.. టీఎంసీ విజయం సాధించింది. గతేడాది నవంబర్‌లో ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని చెప్పగా.. రెండు రాష్ట్రాల్లోనూ బీజేపీ విజయం సాధించింది.

లెక్క ఏదైనా... ఫ్యాన్ పక్కా

అసెంబ్లీ ఎన్నికలపై మెజార్టీ జాతీయ, రాష్ట్ర మీడియా సంస్థల ఎగ్జిట్ పోల్స్ స్పష్టీకరణ

సాక్షి, అమరావతి : పేదలకు, పెత్తందారులకు.. విశ్వసనీయతకు, వంచనకు మధ్య పోరుగా దేశ వ్యాప్తంగా అత్యంత ఆసక్తి రేకెత్తించిన ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘనవిజయం ఖాయమని... ఏ లెక్కన చూసుకున్నా మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రావడం పక్కా అని అధిక శాతం జాతీయ, రాష్ట్ర మీడియా, సర్వే సంస్థల ఎగ్జిట్ పోల్స్ తేల్చిచెప్పాయి. రాష్ట్రంలో 50 శాతానికిపైగా ఓట్లతో వైఎస్సార్‌సీపీ తిరుగులేని విజయం సాధిస్తుందని ఇవన్నీ స్పష్టం చేశాయి. దేశ వ్యాప్తంగా క్షేత్రస్థాయిలో విస్తృత యంత్రాంగం ఉన్న టైమ్స్ ఆఫ్ ఇండియా గ్రూప్‌కు చెందిన టైమ్స్‌నౌ-ఈటీజీ రీసెర్చ్ నిర్వహించిన ఎగ్జిట్ పోల్స్‌లో 50 శాతం ఓట్లతో వైఎస్సార్‌సీపీ 14 లోక్‌సభ స్థానాలను చేజిక్కించుకుంటుందని.. ఎన్‌డీఏ కూటమి 48 శాతం ఓట్లతో 11 లోక్‌సభ స్థానాలకు పరిమితం అవుతుందని వెల్లడయింది. టైమ్స్ ఆఫ్ ఇండియా తరహాలోనే దేశ వ్యాప్తంగా విస్తృత యంత్రాంగం ఉన్న దైనిక్ భాస్కర్ గ్రూప్... రాష్ట్రంలో 15–17 లోక్‌సభ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ ఘనవిజయం సాధిస్తుందని.. ఎన్‌డీఏ కూటమి 8–9 లోక్‌సభ స్థానాలకు పరిమితం అవుతుందని తన ఎగ్జిట్ పోల్స్ ద్వారా తేల్చిచెప్పింది. ఇక తెలుగు రాష్ట్రాల్లో టీవీ9 వంటి మీడియా సంస్థలు, సెఫాలజిస్టులు, ఆరా వంటి ప్రతిష్టాత్మక సర్వే సంస్థలు నిర్వహించిన 32 ఎగ్జిట్ పోల్స్‌లో 24 ఎగ్జిట్ పోల్స్‌లో వైఎస్సార్‌సీపీ ఘనవిజయం సాధించడం తథ్యమని.. మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని స్పష్టమయింది.

బీజేపీ భజన చేసే జాతీయ మీడియా ఎగ్జిట్ పోల్స్ తద్భిన్నం..

బీజేపీ భజన చేసే ఇండియాటుడే గ్రూప్, జీన్యూస్.. ఈనాడుతో భాగస్వామ్యం ఉన్న నెట్‌వర్క్‌లోని సీఎన్ఎన్ న్యూస్–18 వంటి రెండు మూడు జాతీయ మీడియా సంస్థలు నిర్వహించిన ఎగ్జిట్ పోల్స్ మాత్రం రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి విజయం సాధిస్తుందని తేల్చడం గమనార్హం. రాజధాని అంశంతోపాటు స్కిల్ స్కామ్‌లో చంద్రబాబును అరెస్టు చేయడంపై ప్రజల్లో సానుభూతి వచ్చిందని.. అదే ఎన్‌డీఏ కూటమి విజయానికి బాటలు వేసిందని ఆ సంస్థలు విశ్లేషించాయి. కానీ వాస్తవంగా రాష్ట్రంలో ఎన్నికల ప్రచారంలో ఇటు వైఎస్సార్‌సీపీగానీ అటు ఎన్‌డీఏగానీ రాజధాని అంశాన్ని ఎక్కడా పెద్దగా ప్రస్తావించలేదు. ఇక స్కిల్ స్కామ్‌లో చంద్రబాబును అరెస్టు చేసినప్పుడు రాష్ట్రంలో ఎక్కడా చిన్నపాటి బంద్‌లు గానీ, ర్యాలీలు గానీ, నిరసనలు గానీ జరగనేలేదు. తప్పు చేశాడు కనక అరెస్టయ్యాడనే రీతిలో జనం స్పందించారు. దీంతో హైదరాబాద్‌లో చంద్రబాబు సామాజిక వర్గానికి చెందిన కొందరు వ్యక్తులు కూపన్లు ఇచ్చి మరీ 'ఐటీ ఉద్యోగుల' పేరిట స్థానికంగా ఒక ఈవెంట్‌లా నిరసన కార్యక్రమం చేశారు. అలాంటిది ఈ రెండు అంశాలూ ప్రభావం చూపిస్తున్నాయని, అందుకే కూటమి గెలుస్తోందని ఈ జాతీయ ఛానెళ్లు చెప్పిన జోస్యం నూటికి నూరుపాళ్లూ తప్పవుతుందని రాష్ట్ర వ్యవహారాలను దగ్గర నుంచి పరిశీలిస్తున్న విశ్లేషకులు స్పష్టంగా చెబుతున్నారు.

ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు ఇవి..

సంఖ్య	సర్వే సంస్థ	వైఎస్సార్ సీపీ	కూటమి
1	పార్థదాస్(చాణక్య)	110-120	55-65
2	జన్మత్‌పోల్స్	95-103	67-75
3	టీవీ9 పోల్	110-120	55-65
4	ర్యాప్ స్ట్రాటజీస్	158	17
5	స్మార్ట్ పోల్	82(+/-8)	93(+/-8)
6	ఆరా	94-104	71-81
7	ఆత్మసాక్షి	98-116	59-77
8	హెచ్ఎంఆర్	91-101	73-83
9	క్యూ-మెగా	120+	50-60
10	పొలిటికల్ లెబొరేటరీ	108	67
11	రేస్	117-128	47-58
12	ఎన్డీఏ ఎగ్జిట్‌పోల్	143	32
13	ఎల్ఆర్ సర్వే	93	82
14	నాగన్న సర్వే	118	49
15	సీ-నెక్స్ట్ ఏపీ	123	52
16	ఎస్ఏఎస్‌గ్రూప్ ఐపీఎస్ఎస్ టీమ్ హైదరాబాద్	126	49
17	కేఎస్ ప్రసాద్	146	29
18	కోగంటి సత్యం	110-125	45-55
19	పోల్ స్ట్రాటజీస్	115-125	50-60
20	అగ్నివీర్	124-128	46-49
21	ఆపరేషన్ చాణక్య	95-102	64-68
22	సీపీఎస్	97-108	66-78
23	ఫస్ట్‌స్టెప్ సొల్యూషన్స్	119	56
24	సీపీఆర్ఎస్	120-135	40-55
25	చాణక్య స్ట్రాటజీస్	39-49	114-125
26	రింగ్ టు పోల్	60	115
27	పీపుల్ పల్స్	45-60	111-135
28	నేషనల్ ఫ్యామిలీ	65-71	104-115
29	పయనీర్	31	144
30	పోల్ పల్స్	45-60	108-116
31	రైజ్	52	123
32	కేకే సర్వే	31	133-144

కనీస జాగ్రత్తలు కూడా తీసుకోని ఎగ్జిట్ పోల్స్‌ను నమ్మేదెలా?

విచిత్రమేంటంటే 'ఇండియా టుడే- మై యాక్సిస్' సంస్థ శనివారంనాడు దేశవ్యాప్త ఎగ్జిట్‌పోల్స్‌ను వెలువరించింది. దీన్లో బీజేపీ నినాదమైన '400' సీట్లకు ఆ పార్టీని చేర్చటమే లక్ష్యంగా ఒకో రాష్ట్రంలో స్వీప్ అంటూ ముందుకు వెళ్లిపోయినట్లు స్పష్టంగా కనిపించింది. పైపెచ్చు రాష్ట్రంలో వైఎస్సార్ సీపీకి 2 నుంచి 4 లోక్‌సభ స్థానాలు వస్తాయని మాత్రమే చెప్పిన ఇండియా టుడే సంస్థ... ఆ సందర్భంగా వైఎస్సార్ సీపీ గుర్తును కూడా ఆప్ గుర్తయిన చీపురుగా చూపించింది. విశేషమేంటంటే దీన్నే తెలుగు దేశం పార్టీ తన ట్విటర్ ఖాతాలోనూ పోస్ట్ చేసుకుంది. మరి పార్టీ గుర్తు విషయంలో కూడా జాగ్రత్తలు పాటించకుండా చేసిన ఈ ఎగ్జిట్ పోల్స్‌ను నమ్మేదెలా? ఇక కొన్ని రాష్ట్రాల విషయంలోనైతే కొన్ని ఎగ్జిట్ పోల్స్ అక్కడ వాస్తవంగా ఉన్న మొత్తం స్థానాలకన్నా ఎక్కువ స్థానాలు ఎన్‌డీఏ గెలుస్తుందని చూపించటాన్ని ఇప్పటికే ట్విటర్లో పలువురు ట్రోల్ చేస్తున్నారు కూడా. ఇదే ఇండియా టుడే- మై యాక్సిస్ సంస్థ 2021లో బెంగాల్లో చేసిన ఎగ్జిట్‌పోల్స్, 2023లో ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లలో చేసిన ఎగ్జిట్‌పోల్స్ పూర్తిగా రివర్సయ్యాయనేది ఇక్కడ గమనార్హం. అంతేకాదు. తాజాగా బీజేపీ కూటమికి దేశంలో అత్యంత భారీగా స్థానాలు వస్తాయని పేర్కొన్న జాతీయ మీడియా సంస్థల ఎగ్జిట్ పోల్స్‌లో చిత్రవిచిత్రమైన తప్పులు కనిపించాయి. ఇండియాటుడే గ్రూప్‌లోని ఆజ్ తక్ నిర్వహించిన ఎగ్జిట్ పోల్స్‌లో తమిళనాడులో కాంగ్రెస్ 9 లోక్‌సభ స్థానాల్లో పోటీ చేస్తే.. అక్కడ 13–15 లోక్‌సభ స్థానాల్లో ఆ పార్టీ విజయం సాధిస్తుందని తేల్చడంతో చర్చలో పాల్గొన్న వారే విస్తుపోయారు. రాజస్థాన్‌లో ఉన్నదే 25 లోక్‌సభ స్థానాలైతే.. ఆ రాష్ట్రంలో 33 స్థానాల్లో ఎన్‌డీఏ విజయం సాధిస్తుందని ఎగ్జిట్ పోల్స్‌లో టుడేస్ చాణక్య వెల్లడించడం గమనార్హం. జార్ఖండ్‌లో సీపీఐ (ఎంఎల్) ఒక స్థానంలో పోటీ చేస్తే.. రెండు నుంచి మూడు స్థానాల్లో ఆపార్టీ విజయం సాధిస్తుందని ఆజ్‌తక్ ఎగ్జిట్ పోల్స్‌లో వెల్లడించింది. హర్యానాలో ఉన్నదే 10 లోక్‌సభ స్థానాలైతే 16–19 స్థానాల్లో ఎన్‌డీఏ విజయం సాధిస్తుందని జీన్యూస్ ఎగ్జిట్ పోల్స్‌లో తేల్చడం విస్మయకరమే. ఇక హిమాచల్‌ప్రదేశ్‌లో ఉన్నవే నాలుగు లోక్‌సభ స్థానాలైతే.. అక్కడ ఎన్‌డీఏ 6–8 స్థానాల్లో విజయం సాధిస్తుందని జీన్యూస్ తేల్చింది. విశేషమేంటంటే ఈ సంస్థలన్నీ రాష్ట్రంలో కూటమికే మెజారిటీ లోక్‌సభ స్థానాలు దక్కుతున్నాయని చెప్పాయి. లోతుగా పరిశీలించినట్లయితే ఈ జాతీయ మీడియా సంస్థలకు రాష్ట్రంలో క్షేత్ర స్థాయిలో ఎలాంటి యంత్రాంగమూ లేదు. వీటిలో చాలావరకూ ప్రజల అభిప్రాయాన్ని ఐవీఆర్ఎస్ ఫోన్ కాల్స్ ద్వారా తెలుసుకుని.. వాటినే ఎగ్జిట్ పోల్స్‌గా వెల్లడించాయి. గ్రామీణ ఓటర్లు, మహిళలు, వైఎస్సార్ సీపీకి ఎప్పుడూ అండగా ఉండే బలహీనవర్గాలు ఇలాంటి సర్వేల్లో పాల్గొనే అవకాశం తక్కువ. దీన్ని బట్టి చూస్తే.. ఈ జాతీయ మీడియా సంస్థలు నిర్వహించిన ఎగ్జిట్ పోల్స్... జూన్ 4న పూర్తి స్థాయిలో తిరగబడతాయని స్పష్టంగానే చెప్పొచ్చు.

వైఎస్సార్‌సీపీ ఓడిపోయే అవకాశమే లేదు..

రాష్ట్రంలో ఎక్కడికక్కడ పరిశ్రమలను తెస్తూ... గ్రామ స్థాయిలో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తూ... ఐదేళ్లుగా కొనసాగిస్తున్న సంక్షేమ పథకాలు.. విప్లవాత్మక సంస్కరణలను జనం పెద్ద ఎత్తున ఆదరించారు. ఈ విషయం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు నిర్వహించిన 'సిద్ధం' సభలతో రుజువయింది. గ్రామీణ ప్రాంత ప్రజలు.. మహిళల్లో వైఎస్సార్‌సీపీకి అత్యంత ఆదరణ ఉందని.. ఇదే ఆపార్టీ విజయానికి బాటలు వేస్తుందని ఇవే జాతీయ మీడియా సంస్థలు గతంలో విశ్లేషించాయి. గ్రామీణ ప్రాంతాల్లో అత్యధిక శాతం ఓట్లు పోల్ కావడం.. మహిళలు ఎన్‌డీఏ కూటమి కంటే వైఎస్సార్‌సీపీకి 12 శాతం అధికంగా వేశారని.. ఇది ఆపార్టీ ఘనవిజయానికి బాటలు వేస్తుందని ఆరా మస్తాన్, చాణక్య పార్థదాస్‌లు కుండబద్దలు కొట్టారు. వీటిని పరిగణనలోకి తీసుకుంటే తాము ఓడిపోయే అవకాశమే లేదని వైఎస్సార్‌సీపీ నేతలు స్పష్టం చేస్తున్నారు.



టైమ్స్ నౌ-ఈటీజీ ఎగ్జిట్ పోల్‌లో వైఎస్సార్‌సీపీ హవా

▶ మొదటి పేజీ తరువాయి

ఓట్లతో 50–58 సీట్లకే పరిమితమవుతుందని వెల్లడించింది. అలాగే, లోక్‌సభ పోలింగ్ విషయానికొస్తే.. వైఎస్సార్‌సీపీ 50 శాతం ఓట్లతో 14 ఎంపీ స్థానాలు, ఎన్డీయే కూటమి 48 శాతం ఓట్లతో 11 ఎంపీ సీట్లు గెలుచుకుంటుందని తెలిపింది. ఈసారి ఏపీలో దాదాపు 82శాతం పోలింగ్ నమోదైందని.. 2019 ఎన్నికలతో పోలిస్తే ఇది ఇంచుమించు రెండుశాతం అధికమని వివరించింది. అంతేకాక, మహిళల ఓటింగ్ కూడా ఈ దఫా 15శాతం అధికంగా నమోదైందని టైమ్స్ నౌ-ఈటీజీ రీసెర్చ్ తెలిపింది.

కౌంటింగ్ నాడు అక్రమాలకు తెగబడటానికే!

రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఎగ్జిట్‌పోల్స్ ఫలితాలు వస్తుండటంతో పలువురు సెఫాలజిస్టులను చంద్రబాబు నాయుడు, లోకేశ్ బెదిరించినట్లు వాళ్లే వ్యాఖ్యానిస్తున్నారు. ఓ సర్వే సంస్థ లోకేశ్ బెదిరింపులను తట్టుకోలేక... ఫలితాలను అట్నుంచి ఇటు మార్చి కూటమి గెలుస్తున్నట్లుగా ఇచ్చిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఎలాగూ రెండ్రోజుల్లో తేలే ఫలితాల కోసం చినబాబు- చంద్రబాబు ఎందుకు ఇంతలా బెదిరింపులకు పాల్పడుతున్నారనే అంశాన్ని నిపుణులు లోతుగా విశ్లేషిస్తున్నారు. తామే గెలుస్తున్నామనే భ్రమలు కల్పించటం ద్వారా వైఎస్సార్ సీపీ క్యాడర్‌లో నిరుత్సాహాన్ని నింపి... కౌంటింగ్ రోజున అవసరమైతే వారిని ప్రలోభపెట్టో, బెదిరించో తమ పబ్బం గడుపుకోవాలనేది తండ్రీ కొడుకుల ఆలోచనగా చెబుతున్నారు. ఈసీ ఎలాగూ తమకే సహకరిస్తుంది కనక ఎలాంటి దారుణాలకైనా వెనకాడకూడదన్నది వీళ్ల ఆలోచనగా చెబుతున్నారు. అయితే పురిట్లోనే సంధికొట్టినట్లు చాలామంది సెఫాలజిస్టులు వీరి బెదిరింపులకు లొంగకుండా వైఎస్సార్‌సీపీ గెలుస్తున్నదని చెప్పటం 'బాబు'లిద్దరికీ మింగుడుపడటం లేదు.

జిల్లా వార్తలు

ఏళ్లు గడిచినా రాని డిపెండెంట్ ఉద్యోగం

కాళ్లరిగేలా తిరుగుతున్న సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి



సింగరేణి ప్రధాన కార్యాలయం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో కొందరికి డిపెండెంట్ ఉద్యోగం అందని ద్రాక్షలా మారింది. ఒక్కో ఏరియాలో ఒక్కో రకంగా కార్మికుల కుటుంబాలను అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. కొత్తగూడెం ఏరియా పీవీకే-5 షాఫ్ట్‌లో పనిచేసిన ఒక కార్మికుడు 2018లో మెడికల్ ఇన్‌వాలిడేషన్ అయ్యారు. ఆయన తన ఉద్యోగాన్ని పెద్ద కుమారుడు లేదా కూతురికి ఇప్పించేందుకు ప్రయత్నించగా వయస్సు దాటిందని తేల్చారు. ఆపై ఆరేళ్ల తప్పించుకుని చిన్న కుమారుడికైనా ఉద్యోగం ఇవ్వాలని 2019లో దరఖాస్తు చేసుకున్నాడు. మళ్లీ రెండేళ్ల తిప్పించుకుని అభ్యర్థికి చెవులు వినపడనందున అర్హుడు కాదని చెప్పారు. ఇక అప్పటి డైరెక్టర్(పా) ఎన్.బలరామ్‌ను కలిసి గోడు వెళ్లబోసుకోగా దరఖాస్తుపై సంతకం చేశారు. అయితే, సంతకం చేశారే తప్ప ఏమీ రాయలేదని అధికారులు చెప్పడంతో మళ్లీ కలిస్తే దరఖాస్తుపై 'నెసెసరీ యాక్షన్' అని రాయగా సుమారు నాలుగు నెలలు దాటినా ప్రక్రియ మొదలు పెట్టకపోవడంపై రిటైర్డ్ ఉద్యోగి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, ప్రభుత్వ శాఖల్లో దివ్యాంగులకు ఆరు శాతం రిజర్వేషన్ ఉన్నప్పటికీ సదరు రిటైర్డ్ ఉద్యోగి కుమారుడి విషయంలో అధికారులు వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు తావిస్తోంది. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని ఆయన కోరుతున్నాడు.

మళ్లీ ఎన్నికలు రావాల్సిందేనా?!



కొత్తమేడేపల్లిలో అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరించిన గొత్తికోయలు (ఫైల్)

- ప్రతీసారి ఓట్ల సందర్భంగా నిరసనలు
- అయినా పరిష్కారానికి నోచుకోని సమస్యలు
- ఇటీవల లోక్‌సభ పోలింగ్ రోజూనా ఆందోళన
- ఏన్కూరు మండలంలోని పలు గ్రామాల ప్రజల ఆవేదన



రాయమాదారంలో లోక్‌సభ పోలింగ్‌ను బహిష్కరించగా చర్చిస్తున్న అధికారులు (ఫైల్)

ఏన్కూరు: ఏన్కూరు మండలంలోని పలు గ్రామాల్లో కొన్నేళ్లుగా పేరుకుపోయిన సమస్యలు పరిష్కారానికి నోచుకోక గిరిజనం ఇబ్బందిపడుతున్నారు. సాధారణ సమయాల్లో పట్టించుకుంటారో లేదోనని, ఎన్నికల సమయాన నిరసన తెలిపితే పరిష్కారానికి నోచుకుంటాయనే ఆశతో ఎన్నికల బహిష్కరణకు పిలుపునిస్తున్నారు. దీంతో అధికారులు హడావుడి చేసి ఓట్లు వేయించుకుంటున్నారు కానీ సమస్యలను పరిష్కరించడం లేదు. దీంతో సమస్యలు అపరిష్కృతంగా మిగిలిపోతుండగా.. మరోమారు ఎన్నికలు రావాల్సిందేనా అన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

అసెంబ్లీ.. లోక్‌సభ కూడా..

ఏన్కూరు మండలంలోని రాజులపాలెం, కొత్త మేడిపల్లి గ్రామస్తులు అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌ను బహిష్కరించారు. దీంతో అధికారులు చేరుకుని సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చి ఓట్లు వేయించారు. ఆ తర్వాత ఎవరూ ఈ గ్రామాల ముఖం చూడలేదు. దీంతో ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లోనూ ఓట్లు వేయబోమని గ్రామస్తులు భీష్మించుకుని కూర్చున్నారు. మళ్లీ అధికారులు వచ్చి సమస్యలన్నీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని నచ్చజెప్పి పోలింగ్ కేంద్రాలకు పంపించారు. అయితే, ఈసారైనా సమస్యలు పరిష్కారానికి నోచుకుంటాయా, లేక స్థానిక సంస్థల ఎన్నికల సమయాన మరోమారు నిరసన తెలపాల్సి వస్తుందా అన్నది తేలాల్సి ఉంది.

రాజ్యమేలుతున్న సమస్యలు..

కొత్తమేడిపల్లిలో నీరు, విద్యుత్, రహదారితో పాటు కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఇక రాజులపాలెం నుంచి గ్రామానికి సమీపాన ఉన్న అద్భుత వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి వెళ్లాలంటే పది కిలోమీటర్లు చుట్టూ తిరగాల్సి వస్తోంది. అలాగే, గ్రామంలో శ్మశాన వాటిక లేక ఎవరైనా చనిపోయిన సమయాన ఇక్కట్లు ఎదురవుతున్నాయి. కాగా, లోక్‌సభ ఎన్నికల్లో రాయమాదారం గ్రామస్తులు తమకు ఎన్నెస్పీ కాల్వపై వంతెన నిర్మించాలని పోలింగ్‌ను బహిష్కరించారు. గ్రామ సమీపాన ఎన్నెస్పీ కాల్వపై వంతెన లేక రెండు కి.మీ. నడిచి తమ పొలాలకు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన చెందారు. దీంతో అప్పట్లో అధికారులు వచ్చి సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించి ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఎన్నికలకు ముందు రోజు ఆరికాయలపాడు గ్రామ ప్రజలు కూడా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆరికాయలపాడు, జన్నారం మధ్య వాగుపై వంతెన లేక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఈ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని చెప్పడంతో గ్రామస్తులు ఆందోళన చేయకుండానే ఓట్లు వేశారు. అయితే, ఇందులో ఏ సమస్య కూడా ఇంతవరకూ పరిష్కారం కాలేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులపై తమకు ఉన్న నమ్మకం వమ్ము కాకుండా పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

కనీస సౌకర్యాలు కరువు



మా రాష్ట్రంలో పనులు లేక గత 15 సంవత్సరాల క్రితం కొత్తమేడేపల్లికి వచ్చి కూలీనాలీ చేసుకుని బతుకుతున్నాం. మా గ్రామానికి విద్యుత్, రోడ్డు, విద్య, వైద్య సౌకర్యాలు లేవు. ఓట్లు మాత్రం ఇచ్చారు. వర్షాకాలం వస్తే తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అసెంబ్లీ ఎన్నికలప్పుడు ఎన్నికలు బహిష్కరించాం. అధికారులు వచ్చి హామీ ఇచ్చారు. కానీ ఇప్పటి వరకు సమస్యలు ఏమీ పరిష్కరించలేదు.

– మడకం గంగరాజు, వలస కూలీ, కొత్తమేడేపల్లి

రైతులకు తీవ్ర ఇబ్బందులు



ఆరికాయలపాడు – జన్నారం మధ్య వాగు ఉంది. దీనిపై వంతెన లేక రైతులు ఇబ్బంది పడుతున్నారు. జన్నారం రైతులకు ఆరికాయలపాడులో, ఆరికాయలపాడు రైతులకు జన్నారంలో పొలాలు ఉన్నాయి. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్తే ఉన్నతాధికారులతో చెప్పి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గతంలోనూ హామీ ఇచ్చినా పరిష్కారం కాలేదు.

– భట్టు హన్మంతురెడ్డి, ఆరికాయలపాడు

వన్యప్రాణుల గొంతెండకుండా..



సత్తుపల్లి రేంజ్‌లో అడవి దున్నలు

- అటవీ ప్రాంతంలో నీటి వసతి
- వేటగాళ్ల బారిన పడకుండా రక్షణ చర్యలు
- నీరు లభిస్తుండడంతో స్వేచ్ఛగా విహరిస్తున్న అటవీ జంతువులు

సత్తుపల్లిటౌన్: వేసవిలో దాహంతో అడవి జంతువులకు అల్లాడిపోకుండా అటవీ శాఖ ప్రత్యేకంగా చర్యలు చేపడుతోంది. మనుషులైతే ఏదో రకంగా నీటిని సంపాదించి దాహార్తి తీర్చుకుంటారు. ఇదే సమయాన నోరులేని మూగజీవాలు దాహార్తి తీర్చుకునేందుకు వసతులు లేక జనావాసాల్లోకి వస్తున్నాయి. కొన్నిసార్లు వేటగాళ్లు ఈ పరిస్థితి ఆసరాగా చేసుకుని మూగజీవాలను హతమారుస్తున్నారు. దీంతో అటవీ శాఖ అధికారులు జంతువుల దాహార్తి తీర్చేందుకు సత్తుపల్లి డివిజన్‌లో నీటి వసతి సదుపాయాలు ఏర్పాటు చేయడంతో అవి స్వేచ్ఛగా విహరిస్తున్నాయి. దట్టంగా అటవీ ప్రాంతం అభివృద్ధి చెందడంతో వన్యప్రాణుల సంతతి పెంపునకు చేపడుతున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయి.

అరుదైన జంతువులతో..

సత్తుపల్లి డివిజన్‌లోని అటవీ ప్రాంతంలో సత్తుపల్లి, తల్లాడ రేంజ్ పరిధిలో అడవి అభివృద్ధి చెంది పచ్చదనం పెరగటంతో అటవీ జంతువులకు ఆవాసంగా మారింది. గతం కంటే జీవాల సంతతి పెరిగింది. ఇక్కడ పదుల సంఖ్యలో అటవీ దున్నలు, జింకలు, దుప్పులు, కుందేళ్లు, నెమళ్లు, అడవి పందులు విహరిస్తున్నాయి. అంతేకాక అంతరించి పోతున్న కొండ గొర్రెలు, నక్షత్ర తాబేళ్లు, మూషిక జింకలు, అడవి పిల్లులు, నక్కలతో పాటు కోతులు, రకరకాల పక్షులు కూడా తిరుగుతున్నాయి. వర్షాకాలం, చలికాలంలో వీటి తాగునీటికి ఏ సమస్యా ఉండదు. ఎండా కాలంలో కూడా వన్యప్రాణుల గొంతెండకుండా సత్తుపల్లి డివిజన్‌లో 92 చెక్‌డ్యామ్‌లు, 223 నీటి కుంటలు, 14 సోలార్ బోర్లు, 63 సాసర్‌పిట్లు ఏర్పాటు చేసి నీటి సదుపాయం కల్పించారు. సాసర్ పిట్లలో అటవీ శాఖ అధికారులు నెలలో రెండు నుంచి మూడు సార్లు ట్యాంకర్లతో నీరు నింపుతున్నారు. ఇలా అటవీ జంతువుల సంరక్షణ చర్యలు తీసుకుంటున్నారు. దీంతో జంతువులు వెదుక్కోకుండా నేరుగా సాసర్‌పిట్‌లు ఉన్న ప్రదేశాలకు వచ్చి నీరు తాగుతున్నాయని అటవీ శాఖాధికారులు ట్రాప్ కెమెరాల ద్వారా గుర్తించారు.



సాసర్‌పిట్‌లో నీరు నింపుతున్న అటవీ సిబ్బంది



సాసర్‌పిట్‌లో నీళ్లు తాగుతున్న దుప్పులు

రేంజ్	చెక్‌డ్యాంలు	నీటికుంటలు	సోలార్ బోర్లు	సాసర్‌పిట్లు
సత్తుపల్లి	56	163	12	38
తల్లాడ	36	60	02	27

ప్రత్యేకంగా నీటి వసతి..



సత్తుపల్లి డివిజన్‌లో అటవీ జంతువులకు ఎండలతో ఇబ్బంది తలెత్తకుండా నీటి వసతి కల్పించాం. సోలార్ బోర్లతో పాటు సాసర్‌పిట్లను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు నీటిని నింపుతున్నాం. తద్వారా వన్యప్రాణులకు పూర్తి స్థాయిలో నీటి సదుపాయం కల్పించాం.

– వి.మంజుల, ఎఫ్‌డీఓ, సత్తుపల్లి

మయూర వయ్యారం!



ఓ మయూరం తన అందాలతో ఆహ్లాదాన్ని పంచుతోంది. ఎండల కారణంగా నెమళ్లు దాహార్తి తీర్చుకునేందుకు జనావాసాల్లోకి వస్తున్నాయి. ఈ క్రమంలోనే అశ్వారావుపేట మండలం బండారిగుంపు శివారులోని సమక్క – సారలమ్మ గద్దెల వద్ద తిరుగుతున్న నెమలి తన రూపం, విన్యాసాలతో ఆకట్టుకుంటోంది. ప్రస్తుతం వర్షాలతో వాతావరణం చల్లబడడంతో ఉదయం, సాయంత్రం జనావాసాలు, పొలాలు, చెట్లపై తిరుగుతున్న నెమలిని స్థానికులు ఆసక్తిగా గమనిస్తూ కెమెరాల్లో బంధిస్తున్నారు. – అశ్వారావుపేటరూరల్

సత్తుపల్లి ఆర్టీసీ కార్గో కౌంటర్‌కు అవార్డు



మునీర్ పాషాను సన్మానిస్తున్న అధికారులు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి ఆర్టీసీ కార్గో కౌంటర్‌కు కరీంనగర్ జోన్ స్థాయిలో అవార్డు లభించింది. ఇటీవల భద్రాచలంలో జరిగిన శ్రీసీతారామచంద్ర స్వామి కల్యాణోత్సవం సందర్భంగా సత్తుపల్లి కార్గో కౌంటర్ ద్వారా 1,366 ముత్యాల తలంబ్రాల ప్యాకెట్లు బుక్ చేశారు. దీంతో ఖమ్మం రీజియన్‌లోనే కాక కరీంనగర్ జోన్‌లోనే ముందంజలో నిలవగా సత్తుపల్లి కార్గో కౌంటర్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఎస్‌కే మునీర్ పాషాకు ఖమ్మంలో ఆదివారం కార్గో ఏటీఎం పవన్, ఖమ్మం డిపో మేనేజర్ శ్రీనివాస్ అవార్డు అందజేసి సన్మానించారు. అలాగే, మునీర్‌కు డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మి, అసిస్టెంట్ మేనేజర్ విజయశ్రీ, వీబీఓ ఆనంద్, ఉద్యోగులు అభినందించారు.